# నిజంగా ఎవరిని ప్రేమించాలి?

'ప్రవాసి'



ఆరోజు బిల్వమంగళుడి తండ్రి తద్దినం. అతడికి తప్పనిసరిగా ఇంట్లో వుండాల్సి వొచ్చింది. ఆ రోజెలా గడిచిందో ఈశ్వరుడికే ఎరుక. బిల్వమంగళుడు మాత్రం పరధ్యానముద్రలో అన్ని పనులు యాంత్రికంగా చేసుకుపోతున్నాడు. శ్రాద్ధకర్మలనించి విడుదలై తన ప్రేయసి వేశ్యవధూటి చింతామణిని చేరుకోడానికై ఎదురుచూపులో అతనికి క్షణక్షణమొక యుగంగా భాసించింది.

దీపదీపాలవేళకి పనులన్నీ తెముల్చుకుని పరుగులు ఉరకలతో నదీతీరం చేరుకున్నాడు. చూస్తుండగా మిన్నంతా కారు మబ్బులు కమ్ముకొచ్చాయి. అంధకారం నలు చెరగుల ఆవరించింది. ప్రబలవేగంతో తుఫాను గాలులు తరుముకొచ్చాయి. బిల్వ మంగళుడికి నదీతీరంలో ఎక్కడా ఒక్క నావికుడు కూడా తారసపడలేదు. నౌకాన్వేషణంలో చాలా ఆలశ్యమయిపోయింది. గాఢాంధకారం భూవలయాన్ని ఆవరించింది. ఆవలి తీరం చేరుకోడానికి ఏ సాధనం లభించాక ఈదుకు ఆవలితీరం చేరుకోడానికి నిశ్చయం చేసుకున్న బిల్వమంగళుడు నదిలోకి దూకాడు. ఆకస్మికంగా నదిలో కొట్టుకుపోతున్న కుళ్ళిన శవం అతనికి ఎదురుపడింది. ఆ చీకట్లో అది కలపదుంగ అనుకుని దాని సాయంతో ఈదుకుంటూ ఆవలితీరం చేరాడు.

గాఢాంధకారంలో జోరైన తుఫాను గాలి వానలో చింతామణి తన ఇంటి తలుపులు కిటికీలు మూసివేసింది. ఆరోజు నిత్యయాత్రికవిటుడు బిల్వమంగళుడి పితృశ్రాద్ధం. అందుచేత అతను వచ్చే ప్రసక్తే లేదు. అందువల్ల నిశ్చింతగా నిద్రపోయింది చింతామణి.

బిల్వమంగళుడామె వీధివాకిలి చేరుకుని గట్టిగా ఆమెను పిలుస్తూ తలుపులు తట్టాడు. గాలి వాన హోరులో చింతామణికి అతని పిలుపు చెవిన పడలేదు. ఉరుముల ఆర్భాటంలో మెరుపు మెరిసింది. ఆ మెరుపు వెలుగులో పై అంతస్థు కిటికీలో వేలాడుతున్న తాడులాంటిది కనిపించింది బిల్వమంగళుడికి. ఆ తాడును పట్టుకుని పైకెక్కి గాలిజోరుకి తెరుచుకున్న కిటికీలోంచి లోపలికిపోయి చింతామణిని మేలుకొలిపాడు.

మేలుకొన్న చింతామణి బిల్వమంగళుడ్ని చూసి అచ్చెరపోయింది. "అర్ధరాత్రవుతోంది. ఇంత భీకరమైన గాలివానలో నువ్వెలా రాగలిగావు. నీ శరీరం నించి భరించరాని ఈ దుర్గంధమేమిటి"? అని ప్రశ్నించింది.

తాను నదిలో కొట్టుకొచ్చిన కలపదుంగ సాయంతో నదిని దాటి వొచ్చానని, పై అంతస్తు కిటికీలో వేలాడుతున్న పట్టు తాడు సాయంతో ఇంట్లో ప్రవేశించానని చెప్పాడు బిల్వమంగళుడు. ఇంతట్లో వాన తగ్గుముఖం పట్టింది. దీపం వెలగించిన చింతామణి కిటికీలో వేలాడుతున్న భయంకరమైన కాలనాగుని చూచి కంపించిపోయింది. "పదండి మీరే కలపదుంగ సాయంతో నదిని దాటి వచ్చారో చూద్దాం" మంటూ చింతామణి కాగడా పట్టుకుని అతని వెంట నదీతీరానికి నడిచి, ఒడ్డున పడివున్న జలజంతువుల కొరు కుళ్ళతో కుళ్ళి దుర్గంధం నిండిన శవాన్ని చూసింది, అదే కలపదుంగగా ఎంచి దాని సాయంతోనే నదిని దాటి వచ్చాడు బిల్వమంగళుడు.

చింతామణి హృదయం పట్టరాని జుగుప్సతో నిండిపోయింది. చీదరించుకుంటూ "విప్రకుమారా ఈరోజు మీ తండ్రి పవిత్రశ్రాద్ధం, అయినా కానీ ఈ కులటకోసం పరిగెత్తుకొచ్చావు. ఎవరి ప్రేమలో నీకు కుళ్ళిన శవం దుర్గంధం స్ఫురించలేదో, కాలసర్పం పట్టుతాడుగా కనిపించిందో ఆ నీ ప్రేమకి పాత్రులెవరో కళ్ళు విప్పి చూడు. ఈ నా శరీరమూ ఈ శవంలాంటిదే. దీంట్లోను రక్తమాంసాలు, ఎముకలు, మలమూత్రాదికాలు వున్నాయి. ఈ శవమేనా నీ ప్రేమకి పాత్రమైనది నీకీ శవం మీద ఎంత ప్రేమవుందో, ఆ ప్రేమలో వెయ్యోవంతైనా భగవంతుడి మీద వుంటే నీ జీవితం ధన్యమైపోదా?" అంది.

ఆమె మాటలు బిల్వమంగళుడి హృదయంలో తగలాల్సిన చోట తగలాల్సిన తరుణంలో తగిలాయి. "చింతామణి నీవే నాగురువువి" అంటూ ఒక్క నిమిషం ఆలసించకుండా, ఆలోచించకుండా బృందావనధామానికి కదిలిపోయాడు. ఎవర్ని నిజంగా ప్రేమించాలో అతనికి ఎరుకపడింది. అనంతరకాలంలో బృందావనధామంలో కఠోరతపోదీక్షలో శ్రీకృష్ణ ప్రేమలో తరించిపోయింది అతని జీవితం.

(మహాత్మ కృష్ణ ప్రేమానందుల నించి విన్న కథ)